# నేరాలు-శిక్షలు

టెంపోరావ్

ఎవరో తలుపును తట్టారు. ఆమె టైమ్ చూసింది. పద కొండు కావస్తోంది. అతడు మామూలుగా అదే టైముకు వస్తాడు.

భయపడుతూ ఆమె తలుపు తెర్చింది. గంగరాజు తూలుతూ లోపలకు వచ్చాడు. కోపంగా ఆమెవైపు చూశాడు.

"నేనింత సేపు బయట నిలబడాలా?" అర్చాడు.

"మీరు తట్టగానే నేను తలుపు తెర్చాను" అందామె వినయంగా.

"నేను గుడ్డివాడినటే? రాస్కెల్, ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడు!" గద్దించాడతను.

ఆమె జవాబివ్వలేదు. గోడకు వేళ్ళాడుతున్న కృష్ణుడి ఫోటోవంక చూసింది. తనని దేవుడే రక్షించాలి.

తను ఏం చెప్పినా అతడి ఆగ్రహం పెరిగిపోతుంది. ఆఫీసు పని అయ్యాక అరక్ సేవించి భర్త యింటికి

చస్తాడు. తనతో పోట్లాడి, తన్ని కొట్టి చివరకి అతడు నిద్రపోతాడు. మౌనంగా నుంచుని ఆమె ఆలోచిస్తోంది.

ఒక కాలు కొద్దిగా విరిగిన కుర్చీలో అతడు తటాలున కూర్చున్నాడు. కాలు పూర్తిగా విరిగి కుర్చీ అతడితో సహా పక్కకు పడింది.

కోపంగా అతడు లేచాడు. పళ్ళు కొరుకుతూ ఆమె వైపు వెళ్ళాడు.

“ఇది యిల్లుకాదే, నరకం. కూర్చోడానికి కుర్చీకూడా లేదు!” అరుస్తూ ఆమె చెంపమీద కొట్టాడతను.

ఆమె వెనక్కు జరిగింది. ఈ గొడవ విని యిద్దరు కొడుకులు, కూతురు నిద్రలేచి పక్క గదిలోంచి పరుగెత్తుకొచ్చారు.

గంగరాజు భార్య జుత్తు బలంగా పట్టుకున్నాడు.

“అమ్మని కొట్టొద్దు నాన్నా!” పెద్దకొడుకు ఏడుస్తూ అరిచాడు.

“వెధవా, నిన్ను తన్నాలిరా!” అని అతడు కొడుకు వైపు వెళ్ళాడు.

ఎర్రగా వున్న తండ్రికళ్ళవైపు చూస్తూ పిల్లలు దూరంగా జరిగారు.

“వాడినెందుకు కొట్టడం? నన్నే కొట్టి మీ కోపాన్ని చల్లార్చుకోండి” అందా అబల.

అతడు వెనుదిరిగి ఆమె దగ్గరికెళ్ళి జుత్తు పట్టుకుని వీపుమీద బాదాడు.

“ఇంటికొచ్చిన భర్తకు తిండైనా పెట్టావటే?” అరిచాడతను.

“పదండి పెడ్తాను” అందామె.

“నేను వెళ్ళి నువ్వు వడ్డించినదాకా కాచివుండాలా?

ఎంత పొగరు!"

ఆమెను పదేపదే కొట్టాడతను. దూరంగా నిలబడి అదంతా నిస్సహాయంగా పిల్లలు చూస్తున్నారు.

ఆమె కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి. కోపంతో ఆమె జాకెట్‌ను బలంగా లాగాడతను. ఒకవైపున జాకెట్ చిరిగిపోయింది. ఆమె స్తనాలు బయటకు కనిపిస్తున్నాయి.

అమాంతంగా యెవరో తలుపు తోసుకుని లోపల కొచ్చి తలుపును వీపుతో మూసి గంగరాజు వైపు చూశాడు.

"నీ భార్యమీద మళ్ళా చెయ్యేస్తే నువ్వు బతికి వుండవు!" అన్నాడా ఆగంతకుడు.

"ఎవరు నువ్వు? రాస్కెల్ బయటకుపో!" అరుస్తూ అతడివైపు నడిచాడు గంగరాజు.

తలుపు దగ్గర వున్న వ్యక్తి మాస్కు ధరించాడు. అతడి చేతిలో వున్న కమ్చీ పైకి లేచింది. మరుక్షణంలో గంగరాజు ఒంటిమీద ఛళ్ళుమంది.

గంగరాజు అరుస్తున్నాడు కాని అతడు వదల్లేదు. కమ్చీతో కొడ్తూనే వున్నాడు. అతడు బాధతో, భయంతో బొబ్బలెడుతున్నాడు.

కమ్చీ ఆగింది. మాస్కు రంధ్రాల్లోంచి అతను గంగరాజువైపు చూశాడు.

"ఇటుపైన మళ్ళా ఎప్పుడైనా నీ భార్యనీ, పిల్లల్నీ కొడితే నేనిక్కడికి వచ్చి నిన్ను కఠినంగా శిక్షిస్తాను" అరిచాడతను.

"ఇటుపైన ఎప్పుడూ కొట్టను."

"గంగరాజ్, 20 ఏళ్ళనుంచి వుద్యోగంలో వున్నావు.

నీకు వచ్చేది 800. అందులో సగంపైన అరక్కే పోతుంది. తప్ప తాగి యింటికొచ్చి వీళ్ళందర్నీ తన్నుతావు! నీ జీవితాన్ని మార్చుకుని మనిషిలా బతుకు!" అన్నాడతను.

అతడు తలుపు తెర్చి బయటకు పోయాడు. గంగరాజు కోపంగా భార్యవైపు చూశాడు.

"ఎవడే యీ రంకు మొగుడు? వాడిచేత నన్ను కొట్టిస్తావటే?" అరుస్తూ లేచాడతను.

భార్యవైపు కదులుతున్నాడు. ఆమె చాలా భయపడ్తోంది. అతడెవరోగాని తన భర్తను వాడల గొట్టేశాడు. సినిమాల్లో జరిగినట్లు అంతా సాగిపోయింది.

గంగరాజు ఆమె జుత్తు పట్టుకొని లాగాడు. ఆమె అర్చింది. తటాలున తలుపు తెరవబడింది. గుమ్మాని కటువైపున మాస్కు ధరించిన మనిషి నిలబడ్డాడు.

గంగరాజు అటువైపు చూసి భయంతో వెనక్కు పరుగత్తాడు.

"నేను లేననుకొని నీ భార్యవైపు చెయ్యి ఎత్తకు! నేను నిన్ను అనుక్షణం గమనిస్తూనే వుంటాను" అన్నాడతను.

"నన్ను క్షమించు. నేను నా భార్యనూ, పిల్లల్నీ ఎప్పుడూ కొట్టను" అన్నాడు గంగరాజు.

"జాగ్రత్త!" అని హెచ్చరించి బయటనుంచి అతడు తలుపు మూశాడు.

అటుపైన తన భార్యను గంగరాజు తిట్టలేదు. మౌనంగా వెళ్ళి తనగదిలోని పరుపుమీద వాలిపోయాడు. కాస్సేపట్లో అతడికి నిద్రపట్టేసింది.

మర్నాటి రాత్రి పదింటికల్లా అతను యింటికి చేరుకున్నాడు. ఎక్కువగా తాగినట్లు లేదు.

"భోజనానికి రండి" అందామె.

"వడ్డించు, వస్తాను" అన్నాడతను.

అతడు భోజనం చేశాడు. ఆమెతో మాట్లాడలేదు. తిన్నగా తన పడగ్గదికి వెళ్లి పడుకున్నాడు.

రోజులు గడిచిపోతున్నాయి. కాని మునపటిలా అతడు ప్రవర్తించడం మానేశాడు.

అతడెవరో ఆమెకు తెలియదు. తన భర్తను అతడు కొడుతుంటే ఆమె ఆనాడు విచారించింది. భయపెట్టి అతడు తన భర్తను మార్చినందుకు ఆమె యిప్పుడు సంతోషిస్తోంది.

తనతో ముభావంగా వుంటున్న తన భర్త త్వరలో యింకా మారాడనీ, మంచి మనిషిగా జీవిస్తాడనీ ఆమె విశ్వాసం.

## 2

ఏర్ కండిషండ్ హాల్లో ఫ్లోరసెంట్ లైట్లు ప్రకాశవంతంగా వెల్గుతున్నాయి.

అది సౌండ్ ప్రూఫ్ గది. గదిలో ఎంత అర్చినా బయటవాళ్ళకు వినబడదు.

కుషన్డ్ కుర్చీల్లో 120 మంది కూర్చుని వున్నారు. ప్రతి కుర్చీమీదా నంబరు వుంది. యెదురుగా వేదికమీద పర్చిన వెల్వెట్ దుప్పటి తళతళ మెరుస్తోంది.

గదిలోని వాళ్ళు ఏవేవో విషయాలు మాట్లాడుకుంటున్నారు. బజ్జర్ మోగింది. అందరూ మాట్లాడ్డం మానేశారు.

అందరి చూపూ వేదికవైపు వెళ్లింది. పొడుగ్గా, లావుగా వున్న ఒకతను వేదికమీదకు వెళ్లి కుర్చీలో ఆశీనుడయ్యాడు.

అతడి ముఖానికి నీలం రంగు మాస్కు వుంది. మాస్కు రంధ్రాల్లో నుంచి కళ్ళు, పెదిమలు కనిపిస్తున్నాయి. చెవుల ప్రాంతంలో మాస్కుకు నిలువుగా స్లిట్స్ వున్నాయి.

అతను సూటులో వున్నాడు. చేతులకు గ్లవ్స్ వున్నాయి. అందరి చూపూ అతడిమీదే నిల్చిపోయింది. అతనెవరో అక్కడ కూర్చున్న వాళ్ళెవరికీ తెలియదు.

అతడు వాళ్ళకు బాస్, నాయకుడు.

"డియర్ ఫ్రెండ్స్, మార్చి మాసం సమావేశానికి హాజరైన జోనల్ లీడర్లకు నా సుస్వాగతం. గడిచి పోయిన మాసంలో మీ పర్యవేక్షణలో చాలా విజయాలను మనం సాధించాం. మన సీక్రెట్ సర్క్యులర్స్ ద్వారా అంతా మీకు తెలిసే వుంటుంది."

అతడు ఆగాడు. జేబులోంచి కొన్ని పేపర్లు తీసి వాటిని చూస్తూ వుండిపోయాడు. గదిలో చాలా నిశ్శబ్దంగా వుంది.

"డియర్ ఫ్రెండ్స్, పోలీసు కమీషనర్ ఆఫీసునుంచి పట్నంలోని నేరాలను గురించి కొన్ని వివరాలు నాకు అందాయి. ఈ పట్నంలో నేరాలు నెలనెలా తగ్గిపోతున్నాయి. గత డిశంబరులో యాభైమంది యువతులు ఈవ్ టీసింగ్ గురించి పోలీసులకు రిపోర్టు యిచ్చారు. గత మాసంలో పోలీసు రిపోర్టిచ్చిన వాళ్ళు యిరవై మంది వున్నారు. ఇదేవిధంగా బస్సుల్లో జేబుదొంగల మూలంగా ప్రతిరోజూ కొన్ని వందలమంది వాళ్ళ పర్సులను పోగొట్టుకునేవారు. అది కూడా బాగా తగ్గింది. రేప్ కేసులు, హత్యలు తగ్గాయి.

"వాళ్ళ కృషిమూలంగా యిదంతా జరిగిందని పోలీ

కులు భోవిస్తున్నారు. ఇదంతా తగ్గడానికి ముఖ్య కారకులు మీరని మనకు తెలుసు. ఇదంతా సాధించి నందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను."

గదిలోని వాళ్ళు చప్పట్లు కొట్టారు.

"ఇంతవరకూ వచ్చిన విజయాలతో తృప్తిపడి మనం విశ్రాంతి తీసుకోకూడదు. ఒక రాక్షసుడు పోతే మరో రాక్షసుడు యీ పట్నంలో తలెత్తుతూ వుంటాడు. అందువలన మనం ఎలర్టుగా వుండాలి. ఈ నాటి మనుషులలో ధైర్య సాహసాలు క్షీణించాయి. ఇది మంచిది కాదు. చెడును ఆపడానికి, మంచిని పెంచడానికి సిద్ధంగా వుండాలి. ఒక అమాయకుడిని యెవరైనా హింసిస్తూవుంటే మనం ఆ హింసకాండను ఆపాలి. మనుషులు అలా ధైర్యంగా ప్రవర్తిస్తే దేశంలో నేరాలు తగ్గుతాయి."

అతడు ఆగాడు. క్షణకాలం అందరివైపూ చూశాడు.

"డియర్ ఫ్రెండ్స్. చట్టరీత్యా మనం చేసేది ఒక విధంగా నేరం అవుతుంది. ప్రజలను రక్షించడం, దుష్టులను శిక్షించడం పోలీసులు, కోర్టులు చేస్తాయని మన చట్టం అంటుంది. ఇంతవరకూ వాళ్ళమీద ఆధారపడి ప్రజలు అధోగతి పాలయ్యారు. మనం తొందరగా రంగంలోకి దూకి నేరాలను ఆపగలం. నేరస్థులను రక్షించగలం. అందుకే ప్రజలు మనం చేసేది మెచ్చుకుంటున్నారు."

వుత్సాహంగా అందరూ చప్పట్లు కొట్టారు.

"ఫ్రెండ్స్, యిప్పటిలాగే మీరు నిర్విరామంగా కృషి చేస్తారని నమ్ముతూ యీ సమావేశాన్ని ముగిస్తున్నాను. అవసరాన్నిబట్టి మీరు నన్ను నా గదిలో

కల్పుకుని స్వయంగా నాతో మాట్లాడొచ్చు" అని అతడు కుర్చీలోంచి లేచాడు.

అందరికీ నమస్కరించి అతడు డయాస్ దిగి వెళ్లిపోయాడు. అతడు వెళ్లిన కొంత సేపటివరకూ హాలు వాళ్ళ చప్పట్లతో మారుమ్రోగింది.

3

బస్సు వేగంగా వెళ్లి ఒకచోట ఆగింది. ఆ సేకమంది తోసుకుంటూ బస్సులో ఎక్కారు. మిస్ అనసూయ కిక్కిరిసి వున్న బస్సులో నిలబడింది. హేండ్ బాగ్ ను ఆమె జాగ్రత్తగా పట్టుకుంది.

ఆమెకు జీతం ఆవాళే వచ్చింది. హేండ్ బాగ్ లో తొమ్మిదివందల రొక్కం వుంది. ఆ డబ్బును జాగ్రత్తగా తీసుకువెళ్ళి ఆమె తన తల్లికి యిస్తుంది. యిద్దరు తమ్ముళ్లు, ముగ్గురు చెల్లెళ్ళు, తల్లి ఆమెమీద ఆధారపడి జీవిస్తున్నారు.

ఒక యువకుడు మెల్లిగా ఆమె వెనక్కు చేరాడు. అతను పైకి అందంగా వున్నాడు.

పాంటు, స్లాక్ ధరించాడు. మెళ్ళో బంగారం గొలుసుంది. చేతికి ఖరీదైన సీకో వాచ్!

అతడు ఏదో పెద్ద ఉద్యోగంలో వుండివుండాలి! అనసూయ లోలోపల అతడిని గురించే ఆలోచిస్తోంది.

"అమ్మా, నీ వయసు 28 దాటింది. డబ్బు గడించి మమ్మల్నందర్నీ పోషిస్తున్నావు. కాని నీ భవిష్యత్తును గురించి నువ్వు ఆలోచించడంలేదు. నీకు పెళ్ళయితే మంచిదమ్మా" అంది తల్లి ఒక్కసారి.

"నా పెళ్ళి యిప్పుడు కాదమ్మా. తమ్ముడు బి.కామ్ పాసయ్యాక ఉద్యోగంలో చేర్తాడు. అప్పుడు పెళ్ళా

డాను. మిమ్మల్ని నట్టేట వదిలేసి నేను ఆనందించలేను"
అంది అనసూయ.

"అలా కాదమ్మా యింకా వయసు వస్తే పెళ్ళి కావడం కష్టమవుతుంది. మనతో వుండే అల్లుడికోసం చూద్దాం" అంది తల్లి.

ఇదంతా ఆలోచిస్తూ ఆమె వెనక్కి తిరిగిచూసింది. ఆ యువకుడు లేడు. ఎక్కడో అతడు దిగిపోయివుండాలి. ఆమె లోలోపల నవ్వుకుంది. ఇలా అనేకమంది తనకు కనిపించి మాయమయ్యారు.

ఆమె చాలాదూరం వెళ్ళాలి. బస్సు ఆగుతోంది. మళ్ళీ ప్రయాణం సాగిస్తోంది.

ఒక బస్టేండులో దిగిన ఆ యువకుడు వేగంగా నడుస్తున్నాడు. అతడు దిగిన బస్సు వెళ్ళిపోతోంది. జేబు లోంచి ఒక కవరుతీసి లోపలకు చూశాడతను. చాలా డబ్బుంది. తను అదృష్టవంతుడే!

అతడు కవర్ను జేబులో పెట్టుకుంటున్నాడు. ఎవరో అమాంతంగా అతడి చెయ్యిని పట్టుకున్నారు. అతడు ఆశ్చర్యంగా చూశాడు. తన చెయ్యి పట్టుకున్న వ్యక్తి మాస్కులో వున్నాడు.

మాస్కు మనిషి కవర్ని లాక్కున్నాడు.

"ఆ కవరు నాది" అరిచాడా యువకుడు.

సమీపంలో ఎవ్వరూ లేరు.

"ఈ కవరు ఆ యువతి హేండ్‌బాగ్ లోది. హేండ్ బాగ్‌ను బ్లేడుతో కోసి యీ కవర్ను పట్టుకుని నువ్వు దిగిపోయావు. నీ వెనకనే నేనూ దిగాను" అన్నాడు మాస్కు మనిషి.

"సగం వాది, సగం నీది!" అన్నా డా యువకుడు.

"నేను దొంగను కాను. ఈ కవర్ను ఆమెకు వాపసు చేస్తాను. నిన్ను పోలీసులకు అప్పగిస్తాను."

"ప్లీజ్, నన్ను పోనీయండి!"

మాస్కు మనిషి అతడివైపు సూటిగా చూశాడు.

"నువ్వు పైకి రోమియోలా వున్నావు. యెందుకిలా పిక్ పాకెట్ అయ్యావు?" ప్రశ్నించాడు మాస్కుమనిషి.

"వుద్యోగం దొరకక."

"వుద్యోగం యిస్తే యీ పని మానేస్తావా?"

"ఇప్పించి చూడండి."

మాస్కు మనిషి ఒక కార్డు యిచ్చాడు.

"రేపు ఆ నంబరుకు ఫోన్ చేయి. నంబరు 99 యీ కార్డు యిచ్చాడని చెప్పు. వుద్యోగం దొరుకుతుంది. ఇటు పైన దొంగగా నువ్వు బతకనక్కర లేదు."

"తప్పక వెళ్తాను సార్" అన్నా డా యువకుడు.

బస్సు దిగి చాలా దూరం నడిచి మిస్ అనసూయ తన యింటికి చేరుకుంది.

"కాఫీ తెస్తానమ్మా! కాళ్లూ చేతులూ కడుక్కో!" అంది తల్లి.

అనసూయ ముహం కడుక్కుంది. దుస్తులు మార్చుకుని కుర్చీలో కూర్చుంది. ఆప్యాయంగా తల్లి కాఫీ తెచ్చి యిచ్చింది. కాఫీ తాగుతూ అనసూయ తన తల్లివైపు చూసింది.

"అమ్మా, కవర్లో నా జీతం వుంది. తీసి దాచు!" అంది అనసూయ.

తల్లి హేండ్ బాగ్ తెచ్చి చూసింది. ఎక్కడా కవరు లేదు!

"కవరు లేదమ్మా!" అంది తల్లి.

కాఫీ తాగేసి అనసూయ తన హేండ్ బాగ్ ను చూసింది. కవరు లేదు! ఆమె గుండె దడదడలాడింది. కవరు ఏమైంది?

ఆమె హేండ్ బాగ్ వైపు పరీక్షగా చూసింది. బ్లేడుతో ఎవరో హేండ్ బాగ్ ను ఒకచోట అడ్డంగా కోశారు. గుడ్ గాడ్, తన జీతం కవర్ను ఎవరో కొట్టేశారు!

"అమ్మా, నేను వచ్చేటప్పుడు బస్సులో చాలా రద్దీగా వుంది. ఎవరో నా జీతాన్ని దొంగిలించారు!" అంది అనసూయ.

ఆమె కళ్ళలో జీవంలేదు. ఆమె భయపడ్తోంది.

"పోనీ అమ్మా! బాధపడకు! దొంగలకు మన కష్టాలు తెలియవు" అంది తల్లి. కూతుర్కి ధైర్యం యివ్వడానికి.

"ఈ నెల ఎలా గడుస్తుందమ్మా?" అంది అనసూయ ఏడుస్తూ.

"ఏడవకమ్మా! మన్ని పుట్టించిన దేవుడు జీవితాన్ని నెట్టుకుపోయే విధానాన్ని సూచిస్తాడు" అంది తల్లి.

"అమ్మా, ఏమైంది? అక్క ఎందుకు ఏడుస్తోంది?" తమ్ముడు అడిగాడు.

ఎందుకో తెలియకుండా ముగ్గురు చెల్లెళ్ళూ ఏడ్వసాగారు. గదిలో అందరూ ఏడ్చేవాళ్ళే!

"తప్పు నాదమ్మా. నేను అజాగ్రత్తగా వున్నాను. అందుకే ఎవడో నా హేండ్ బాగ్ ను కోయగల్గాడు" అంది అనసూయ.

"అమ్మాయి, చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభించదు. పోయిన డబ్బు పోయింది. మనసు పాడు చేసుకోకు!" అంది తల్లి.

తొమ్మిది దాటింది. అందరూ హాల్లో అలాగే కూర్చు న్నారు. ఎవ్వరికీ ఆకలి లేదు.

"ఎవ్వరూ తిండి తినరా?" తల్లి అడిగింది.

"అక్కతో తింటాం" అన్నారందరూ.

ఎవరో తలుపును తట్టారు. అనసూయ పరుగెత్తికెళ్ళి తలుపు తెర్చింది.

అటువైపు నిలబడిన వ్యక్తిని చూసి వులిక్కిపడింది. మాస్కులో వుందతని ముఖం.

"ఎవరు మీరు?" అడిగిందామె.

"లోపలకొచ్చాక చెప్తాను" అన్నాడతను.

ఆమె సంశయిస్తూ వుండిపోయింది.

"బస్సులో మీ హేండ్ బాగ్ లోని ఒక జేబులోంగ మీ జీతం కవర్ను పట్టుకుపోయాడు. అది నేను చూశాను. అతడి దగ్గర్నుంచి అది లాక్కున్నాను. యిదిగో ఆ కవరు!" అన్నాడతను.

ఆమె కవర్ను తెర్చి చూసింది. జీతం అంతా సవ్యంగా వుంది. అతడివైపు ఆశ్చర్యంగా చూసింది.

"ప్లీస్, లోపలకు రండి!" అందామె.

"ఇప్పుడు కాదు. మరోసారి వస్తాను" అన్నాడతను.

"నాకింత సేవ చేసినందుకు మీకు నా ధన్యవాదాలు" అందామె.

"మీరు పనిచేసే కంపెనీ నాకు తెలుసు. కాని ఇంటి అడ్రెసు తెలియదు. మీ కంపెనీకి ఫోన్ చేసి ఈ అడ్రెసు కనుక్కుని యిక్కడికొచ్చాను. అందుకే ఆలస్యమైంది" అన్నాడతను.

"మీకు నేను ఏదేనా బహుమతిగా యివ్వొచ్చా?" అడిగిందామె.

"మిస్ అనసూయా, నేను దేశోద్ధారకుల సంఘం మెంబర్ని. బహుమతి కోసం మేము పని చేయడంలేదు. లోకంలోని అన్యాయాన్ని, అధర్మాన్ని అరికట్టడానికి మేం కృషి చేస్తున్నాం. ఒక కంటి తడిని తుడవగల్గితే మేం ఎంతో ఆనందిస్తాం."

ఆమె ఆవేశంతో అతడి చేతులు పట్టుకుంది.

"ఎంత గొప్ప సంఘం మీది!" అందామె వుద్రేకంతో.

## 4

రమేష్ తన వాచ్ వైపు చూశాడు. టైము పది అయింది. ఆ వాచ్ నిజంగా తనది కాదు. అతడు దొంగలించాడు.

ఎక్కడా వుద్యోగం దొరక్క అతడు దొంగ కావలసి వచ్చింది. అతడు తల్లినీ, చెల్లెల్నీ పోషించాలి.

తండ్రి వున్నంతకాలం జీవితం హాయిగా సాగిపోయింది. గుండె నొప్పితో తండ్రి చనిపోయాడు. హఠాత్తుగా యింటి బాధ్యత అతడి భుజాలమీద పడింది.

గోవిందన్ సహాయంతో అతడు జేబుదొంగ అయ్యాడు. కాని ఎంతకాలం యిలా బతకడం?

తను జేబు దొంగని తల్లికి తెలిస్తే ఆమె తనని చీపుర్తో కొడుతుంది. ఇంట్లోంచి పొమ్మంటుంది.

రోజూ చిల్లర మల్లర పనులు చేసి డబ్బు గడిస్తున్నట్లు అతడు తల్లితో చెప్పాడు. ఆమె అతడి మాటల్ని నమ్మింది.

టెలిఫోన్ బూత్ వైపు అతడు నడిచాడు. మాస్కు మనిషి చెప్పినట్లు తనకు ఉద్యోగం వస్తుందా? ఏదో నాటకం ఆడి మాస్కు మనిషి డబ్బున్న ఆ కవర్ని

లాక్కుపోయాడు. అతడు తనని మించిన దొంగ కావచ్చు!

ఈ లోకంలో అందరూ మోసగాళ్ళే అనే భావం అతడిలో నాటుకుపోయింది.

అయినా ప్రయత్నించి చూస్తే ఏం పోతుంది? అతను బూత్ లోకి మారి గాజు తలుపు మూశాడు.

కార్డుమీదున్న నంబర్ను తిప్పాడు. చిల్లులో ఎనిమిదణాల కాయిన్ వేశాడు. అటువైపునుంచి, "హల్లో!" అన్నారు ఎవరో.

"నా పేరు రమేష్. నంబరు 99 మీకు ఫోన్ చేసి మీతో మాట్లాడమన్నాడు" అన్నాడతను.

"ఆల్ రైట్, సరిగ్గా మూడింటికిరా!"

"ఎక్కడకు రావాలి? కార్డులో అడ్రెసు లేదు!"

"హోటల్ జన్‌పాత్ కిరా. నేను రూమ్ నంబరు 32లో వుంటాను."

"అలాగే, సార్" అని అతను రిసీవర్ పెట్టేశాడు.

సరిగ్గా మూడింటికి రమేష్ జన్‌పాత్ హోటల్కు చేరుకున్నాడు. రూమ్ నంబర్ 32కి వెళ్ళాడు.

తలుపు తట్టాడు.

"కమిన్!" అందో కంఠం.

అతడు లోపలకు వెళ్ళాడు. గది మధ్యలో వున్న కుషన్డ్ కుర్చీలో బాస్ కూర్చుని వున్నాడు. అతడివైపు సూటిగా చూశాడు.

"తలుపు మూసి యిలారా!" అన్నాడు. బాస్.

తలుపు మూసి అతడు బాస్ ముందుకు నడిచాడు.

"నంబర్ 99 నిన్ను ఎందుకు పంపాడు?"

"నేనొక పిక్‌పోకెట్‌ని. ఒక యువతి జీతం కవరు నేను కొట్టేశాను. నంబరు 99 అది నా నుంచి లాక్కు

న్నాడు. ఆ మేకిస్తాడనుకుంటాను" అన్నాడు రమేష్.

"నీకు వుద్యోగం కావాలి. అంతేనా?"

"అవును, సార్."

"ఎంత జీతం కావాలి?"

"కనీసం రెండువందలు."

"నీమీద ఆధారపడే వాళ్ళు ఎందరున్నారు?"

"అమ్మ, నా చెల్లెలు."

"నీకు రెండువందలు చాలదు. కనీసం ఐదువందలు వుండాలి."

రమేష్ మాట్లాడలేదు.

"మిస్టర్ రమేష్, నీకు 600 జీతంమీద వుద్యోగం యిస్తున్నాను."

"చాలా థాంక్స్, సార్."

"మిస్టర్ రమేష్, ఇవాళనుంచి నువ్వు మా దేశోద్ధారకుల సంఘంలో మెంబరుగా వుండాలి."

"వుంటాను, సార్."

"ఇలా రా" అన్నాడు బాస్.

అతడు బాస్ దగ్గరగా వెళ్ళాడు.

"నీ కుడిచెయ్యి చాచు!"

రమేష్ కుడిచెయ్యి చాచాడు.

బాస్ తన జేబులోంచి ఒక సూదిని పైకితీశాడు. తటాలున ఆ సూదిని రమేష్ చేతిలోకి గుచ్చాడు. సూదిని పైకి లాగేశాడు. రక్తం మెల్లిగా బయటకొస్తోంది.

"రమేష్, నువ్వు దేశోద్ధారకుల సంఘం మెంబరువి. ఇటుపైన నువ్వు ఏ నేరం చేయకూడదు. యెవర్నీ మోసగించకూడదు. ప్రజలకు అన్నివిధాలా సహాయపడాలి!"

"అలాగే చేస్తాను, సార్."

"నంబర్ 99ని ఎక్కడ కల్సుకోవాలో తెలుసా?"

"తెలియదు సార్."

అతడు ఒక కార్డును రమేష్‌కిచ్చాడు.

"ఆ నంబర్కి ఫోన్ చెయ్యి. తనని ఎలా యెక్కడ కల్సుకోవాలో నంబరు 99 చెప్తాడు."

"ఫోన్ చేస్తాను, సార్."

"మిష్టర్ రమేష్, నీ చెల్లెలు పెళ్ళికోసం నువ్వు డబ్బు కూడబెట్టనక్కరలేదు. ఆమె వివాహం నేను చేయిస్తాను. ఆ ఖర్చంతా నేను భరిస్తాను."

రమేష్ ఆశ్చర్యంగా అతడివంక చూశాడు.

"మిమ్మల్ని నేను ముందుగా కల్సుకోకపోడం నా దురదృష్టం" అన్నాడు రమేష్.

బాస్ గంభీరంగా నవ్వాడు.

"రమేష్, మనకు మేలుచేసే సంఘటనలు ఆలస్యంగా వస్తూంటాయి. డోంట్ బాదర్! ఆలస్యంగానైనా వచ్చినందుకు సంతోషించు!" అన్నాడు బాస్.

"మీరు నా జీవితాన్ని మార్చేశారు" అన్నాడు రమేష్ ఆవేశంతో.

# 5

మంగమ్మ బట్టలు వుతుకుతోంది. చీరకుచ్చిళ్ళు పైకెత్తి దోపుకుంది. బలమైన పిక్కలు, మోకాళ్ళు కనిపిస్తు న్నాయి.

ఆమె వయసు పద్దెనిమిదేళ్ళు. ఆమె రెండేళ్ళుగా దేవరాజు యింట్లోనే పనిచేస్తోంది.

దేవరాజు ధనవంతుడు. అతడికి పదిమంది కొడుకు లున్నారు. పెద్ద కుటుంబం. పెద్ద మేడలో అందరూ కలిసే జీవిస్తున్నారు.

వాళ్లలో కొడుకు నరేష్ చూపు యెప్పుడూ మంగమ్మ మీదే వుండేది. అది ఆమె గుర్తించి లోలోపల నవ్వుకునేది. ఆమె యెక్కువగా సినిమాలు చూస్తూవుండేది. ఈనాటి సినిమా కథలు ఆమెలో ఎన్నో కోర్కెలను రెచ్చగొట్టాయి. పచ్చగా లేకపోయినా ఆమె అందంగా అంటుంది. ప్రతిరోజూ ఎక్కువగా పని చేయడంవలన ఆమె శరీరం ఆరోగ్యంగా, బలిష్టంగా అగుపిస్తుంది. వుందుకే ఆమె అంతగా నరేష్‌ని ఆకర్షించింది.

కాని ఆమెను ముట్టుకునే ధైర్యం అతడికి లేకుండా పోయింది. ఇది బయటకు పొక్కితే అందరూ పని మనిషితో సరసాలా అని వెక్కిరించవచ్చు. మరో ముఖ్య కారణం తండ్రి అనారోగ్య స్థితి!

ఏ క్షణంలోనైనా బకెట్ తన్నేసి పైకిపోయే స్థితిలో వున్నాడు తండ్రి.

రోజులు గడిచిపోతున్నాయి. మంగమ్మ అతడి గది తుడుస్తోంది. కళ్ళతో ఆమె అందాన్ని జుర్రేస్తున్నాడు నరేష్.

ఆమె మంచం దగ్గరగా వచ్చింది. ఆమెనుంచి వెలువడే ఏదో పరిమళం అతడిలో కోర్కెను రెచ్చగొట్టింది. అతడు అమాంతంగా ఆమె జడకొసను పట్టుకున్నాడు. ఆమె ముందుకు కదులూ ఆగి అతడివంక చూసింది.

“నరేష్‌బాబూ, ఏమిటిది?”

“నీ జడ బాగుంది. యింత పొడవైన జుత్తు నీకెలా వచ్చింది?” అడిగాడతను.

అతను జడను వదిలేశాడు. నవ్వుకుంటూ ఆమె వెళ్ళి పోయింది.

ఇంట్లో వాళ్ళందరూ హాస్పిటల్లో వున్నారు. తండ్రిని

చూసి నరేష్ తొందరగా యింటికి చేరుకున్నాడు. గేటు ముందు గూర్ఖా, మరికొందరు నౌఖర్లు మాత్రం వున్నారు.

మేడమీదున్న అతడి గదిలోకి వచ్చింది మంగమ్మ. వంగి చీపుర్తో తుడవడం ప్రారంభించింది. అతడు మంచం మీద కూర్చుని వున్నాడు. ఆ క్షణంలో మంగమ్మ దేవతలా కనిపించిందతనికి!

"మంగమ్మా!" పిల్చాడతను.

ఆమె అతడివైపు నవ్వుతూ చూసింది. ఆమె లోపల ధరించిన పావడా అతడికి కనిపిస్తోంది.

"నాన్న హాస్పిటల్లో చేరేసరికి యింట్లో యెందరో లేనట్టుంది" అన్నాడతను.

"హాస్పిటల్ కి వెళ్ళి మీరు తొందరగా వచ్చేశారు!" అందామె.

"అవును, ఎందుకో తెలుసా?"

ఆమె అతడివైపు చూసింది. తీయగా నవ్వింది.

"మంగీ, నీకోసం!" అన్నాడతను.

చలనం లేనట్లు ఆమె నిలబడిపోయింది. మేడ భాగంలో ఎవ్వరూ లేరు. ఈ సమయంపోతే మళ్ళా రాదు.

అతడు లేచాడు. అమాంతంగా ఆమెను కౌగలించుకున్నాడు. ఆమె గింజుకుంది. కాని అతడు పట్టు వదల్లేదు.

"బాబూ, నన్ను వదలండి. పెళ్ళి చేసుకున్న భర్తకి తప్ప మరెవ్వరికీ లొంగను!" అర్చిందామె.

"నిన్ను నేను పెళ్ళాడతాను!"

"మీ మాట నమ్మొచ్చా? నేను పనిమనిషిని. మీరు ధనవంతులు."

"పెళ్ళయినాక నువ్వూ ధనవంతురాలవుతావు."

ఆమెను ముద్దెట్టుకోబోయాడు. ఆమె పెదిమలను పక్కకు తిప్పేసింది.

"పెళ్ళయినాక!" అందామె.

"నామీద నమ్మకంలేదా?"

"వయసులో వున్న మనిషి కోర్కెను తీర్చుకోడానికి ఏదైనా చెప్పొచ్చు!" అందామె.

"నేను అటువంటి వాడిని కాను. నిన్ను నేను అఖండంగా ప్రేమిస్తున్నాను. పెళ్లి అయ్యాక నువ్వు యిక్కడే మాతో వుంటావు. నీకు చదువు కూడా చెప్పిస్తాను. సంవత్సరం తిరిగే లోపల మా అందర్నీ నువ్వు మించిపోతావు!"

"అంత అదృష్టం వరదలా వస్తుందంటే నమ్మలేకుండా వున్నాను" అందామె.

"కొంతమందిని అదృష్టం తుపానులా చుట్టేస్తుంది"

ఆమె అతడి వంక తీయగా నవ్వుతూ చూసింది.

"నాలో ఏముంది మీరంతగా ప్రేమించడానికి?" అడిగిందామె అమాయకంగా.

"నా కళ్ళతో చూస్తే ఏముందో తెలుస్తుంది. బ్రహ్మదేవుడు ఒక అమోఘమైన సుందరిని సృష్టించి పొరపాటున ఆమెను పేదరికంలో పడేశాడు. నిన్ను అక్కడి నుంచి బయటకు లాగి, నీ అందాన్ని అందరూ గుర్తించేటట్లు చేయాలని నేను నిశ్చయించుకున్నాను."

ఆమె కళ్ళమ్మట జలజల నీళ్ళు కారాయి.

అమాంతంగా అతడామె పెదిమలను ముద్దెట్టుకుని, ఆమెను బలంగా హత్తుకున్నాడు.

ఆమెను మోసుకెళ్లి పరుపుమీద పడుకోబెట్టాడు. ఆమె ఖంగారుగా లేచింది. పక్కనే కూర్చుని అత

డామెను పడుకోమన్నాడు.

"అదంతా పెళ్లి అయ్యాక!" అందామె.

అతడామె కళ్ళలోకి సూటిగా చూశాడు.

"నిన్ను నేను ముద్దాడిన క్షణంలోనే దైవం దృష్టిలో మన పెళ్ళి అయిపోయింది. నాకు దైవం ముఖ్యం, ప్రజలు కాదు."

వెల్లకిలా పడుకుని ఆమె అతడి చెయ్యి పట్టుకుంది.

"చేతులో చెయ్యేసి చెప్పండి, నన్ను తప్పక పెళ్ళాడతానని" అందామె.

ఆమె చేతిలో అతడు చెయ్యివేశాడు. "నిన్ను తప్పక పెళ్ళాడతాను. ఈ క్షణంనుంచీ నిన్ను నా భార్యగా స్వీకరిస్తున్నాను" అన్నాడతను వుద్రేకంతో.

ఆనందంతో తొణికిసలాడుతూ ఆమె ఎర్ర గులాబీ పువ్వులా విచ్చుకుంది. నరేష్ తన కోర్కెను తీర్చుకున్నాడు.

"నన్ను మర్చిపోవుగా?"

"అది నువ్వే చూస్తావు. మన పెళ్ళి యీ పట్నంలో సంచలనాన్ని సృష్టిస్తుంది" అన్నాడతను.

చీపుర్ని ఊపుతూ ఆమె హుషారుగా వెళ్ళిపోయింది.

# 6

ఎనిమిదింటిదాకా మేడమీద యితర గదుల్లో వుండే అన్నదమ్ములు లేవరు. అందువలన ఆరు ప్రాంతంలో మంగమ్మ పైకి వెళ్లేది. నరేష్ ఆమె రాకకోసం యెదురు చూస్తూ వుండేవాడు.

ఆమె రాగానే తలుపు మూసేశాడు. అటుపైన యిద్దరూ కొంతకాలంపాటు లోకానికి దూరమయ్యేవారు.

రోజులు గడిచిపోతున్నాయి. ఆమె గర్భవతి

అయింది.

"మన పెళ్ళి వెంటనే జరిగిపోవాలి" అందామె.

"అమ్మతో చెప్పాను. నాన్నతో అమ్మ మాట్లాడుతా నంది."

"పెళ్ళయితేగాని నేను తలెత్తుక తిరగలేను!"

"ఏదో రేపు తేల్చేసుకుందాం" అన్నాడతను.

మర్నాడు ఆమె ఆత్రంగా వెళ్ళింది. నరేష్ ఆమె వైపు సీరియస్‌గా చూశాడు.

"మంగీ, డాక్టర్ శ్రీమతితో మాట్లాడాను. ఆమె కడుపు తీసేస్తుంది. ఖర్చు ఐదువందలు కావచ్చు. ఈ కవరులో 500 వుంది. తీసుకో!" అన్నాడు నరేష్.

"మన పెళ్ళి విషయం?"

"పెద్దలు ఒప్పుకుంటేగాని పెళ్ళికాదు. నేను నీకు అన్యాయం చెయ్యలేదు. ఇద్దరం ఆనందించాం, నే నొక్కడినే కాదు."

ఆమె అతడివైపు గాభరాగా చూసింది.

"మీరు నన్ను మోసం చేశారు. పెళ్ళాడ్తానని నమ్మించి నన్ను అనుభవించి యిప్పుడు తప్పుకోడానికి ప్రయత్నిస్తున్నారు. ఎంగిలి విస్తరిచేసి నన్ను బయట విసరడానికి చూస్తున్నారు" అందామె.

అతడు గంభీరంగా నవ్వాడు.

"మా యింట్లో పనిచేసిన యువతులందరూ నీలాగే నాతో వుండేవారు. వాళ్ళకిచ్చినట్లే నీకూ 500 యిచ్చి పొమ్మంటున్నాను" అన్నాడు నరేష్.

"ఎంత మోసం? నన్ను మీరు బలాత్కరించారు. ఎన్నో కలలు నాలో సృష్టించారు. ఇప్పుడు అదంతా కల్లని తెలుస్తోంది."

"ఇది నీ మొదటి అనుభవం. ఇటుపైన మళ్ళీ యిలా జరిగితే నువ్వెంతగా బాధపడవు! వచ్చేది రాబట్టుకుంటావు!"

"నేను పేద పిల్లను కావచ్చు కాని వేశ్యను కాను" అరిచిందామె.

"అరవకు! కవరు తీసుకొని వెళ్ళు!"

ఆమె కవరు తీసుకోలేదు. కోపంగా కిందకు వెళ్ళిపోయింది.

నరేష్ తల్లి ఆమెను పిల్చింది.

"ఏమే, పైన ఏం చేస్తున్నావు?" అడిగిందామె.

నరేష్ మాటలు ఆమె మెదడులో తిరుగుతున్నాయి.

"అమ్మా, ఆ మంగమ్మని పనిలోంచి తీసేసి పొమ్మను. నా వైపు కామంతో చూస్తుంది. అది నాకిష్టంలేదు" అన్నాడు నరేష్.

నరేష్ తల్లి ప్రశ్నకు ఆమె జవాబివ్వలేదు.

"చూడు మంగమ్మా, నువ్వు పని మానేసి వెళ్ళిపో!" అని ఆమె జీతం యిచ్చేసింది.

"ఎందుకమ్మా నన్ను పొమ్మంటున్నారు?" అడిగిందామె.

"మా వూరునుంచి మరో పనిమనిషి వస్తుంది" అందామె.

నరేష్ తల్లి గూర్ఖాను పిల్చింది. అతడు పరుగెత్తూ వచ్చాడు.

"ఈమెను బయటకు పంపు! ఎప్పుడూ లోపలకు రానీయకు!" అందామె.

ఆమెవైపు చూస్తూ, "ఛలో!" అన్నాడు గూర్ఖా.

ఏదో జరిగుండాలి! అందుకే ఆమె తనని పొమ్మంది.

నరేష్ తల్లితో తనను గురించి ఏం చెప్పాడో! ధనవంతుల కుటుంబాల్లో ఎంత నేరం చేసినా తల్లులు కొడుకులను సమర్థిస్తూనే వుంటారు.

జీతం డబ్బులు తీసుకుని ఆమె బయటకు నడిచింది. గూర్ఖా గేటు మూశాడు.

గేటు బయట ఆమె కొంతసేపు అలాగే నిలబడి పోయింది. కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి.

సినిమాలు చూసి నరేష్ నిజంగా తనను ప్రేమిస్తు న్నాడని ఆమె అనుకుంది. అతడి మాటలు నమ్మి లొంగి పోయింది.

నరేష్ తన శీలాన్ని భంగపర్చాడు. అతడి తల్లి తన్ని పని మాని పొమ్మంది! ఏ తప్పూ చేయని తనకి ఎంత శిక్ష!

ఆమె మేడవైపు చూసింది. ఎక్కడా నరేష్ జాడ లేదు! తనేమైనా నరేష్‌కి లెఖ్ఖలేదు.

ఏడుస్తూ ఆమె పేవ్‌మెంటమ్మట నడుస్తోంది. నరేష్ దుర్మార్గుడు! అతడిని శిక్షించాలి! అదెలా సాధ్యం?

ఎవరో ఆమెను పిల్చారు. ఆమె వెనక్కి తిరిగి చూసింది.

"ఎందుకమ్మా, ఏడుస్తున్నావు?" అడిగాడు ఒకతను.

అతడు పెద్దమనిషిలా వున్నాడు. పాంటు, షర్టు, మధ్యలో నల్లటి బెల్టు. వెనక్కి దువ్విన క్రాపు!

"నా ఖర్మ!" అందామె.

అతడు ఆమె పక్కనే మౌనంగా నడవసాగాడు. ఆమె ఏడుస్తూనే వుంది.

"నువ్వు దేవరాజు యింట్లో పనిచేస్తున్నావా?" అడిగాడతను.

"ఇవాళ పనిలోంచి తీసేశారు."

"ఎందువలన?"

ఆమె ఆలోచిస్తూ నడవసాగింది. తనకు జరిగినదాన్ని గురించి పదిమందికి చెప్తే ఏం లాభం?

"చూడమ్మా, ఏదేనా అన్యాయం జరిగితే నాతో చెప్పు. నేరస్థులను శిక్షించడం నా డ్యూటీ" అన్నాడతను.

నరేష్ చేసినదంతా ఆమె వివరంగా అతడితో చెప్పింది. అతడు ఆమె భుజంమీద చెయ్యి వేశాడు.

"చెల్లీ, నరేష్ గురించి యిటువంటివి కొన్ని రిపోర్టులు నాకు అందాయి. అతను నీలాగే మరికొందరు యువతుల్ని నమ్మించి, అనుభవించి వదిలేశాడు. ఈసారి అతడికి తగు విధంగా బుద్ధి చెప్తాం" అన్నాడతను.

"అన్నయ్యా, ఎవరు నువ్వు?" అడిగిందామె.

"దేశోద్ధారకుల సంఘం మెంబర్ని. నన్ను నంబర్ 25 అని పిలుస్తారు."

"అన్నయ్యా, మీరు నాకు ఎలా సహాయపడగలరు?"

"అనేక విధాల. ఒక పొరబాటు మూలంగా నీకు నెల తప్పింది. నీ కడుపును మేం తీయించేస్తాం. నీకు మరో వుద్యోగం వచ్చేటట్లు మేం చూస్తాం. నీలాంటి అమాయకపు యువతుల్ని కాటేస్తున్న నరేష్ కోరలు పీకేస్తాం."

"ఇదంతా మీరు చేయగలిగితే మీ సంఘం చాలా గొప్పదయి వుండాలి" అందామె.

"అదంతా త్వరలో నువ్వే చూస్తావు" అని అతను వెళ్ళిపోయాడు.

# 7

టైము నాలుగు దాటింది. నరేష్ ఫియట్ కారును వేగంగా పోనిస్తున్నాడు.

బస్టేండులో నిలబడిన ఉషను చూసి అతడు కారు ఆపాడు. ఆమె తన పక్కింట్లో వుంటోంది. ప్రొఫెసర్ రంగారావు కూతురు. ఆమె కాలేజిలో బి.ఎ. చదువుతోంది.

తనింటి పైడాబామీదనుంచి నరేష్ పక్కింట్లోవున్న ఆమెను చూస్తూ వుండేవాడు.

"హై!" అన్నాడతను ఆమె వంక చూస్తూ.

ఆమె కారు దగ్గరకొచ్చింది.

"కమాన్, నిన్ను దింపేస్తాను" అన్నాడతను.

"థాంక్స్" అని ఆమె ముందు సీటుమీద కూర్చుని తలుపు మూసింది.

"మీ రెందాక వెళ్తున్నారు?" అడిగిందామె.

"ఈగా థియేటర్ కి, అక్కడినుంచి యింటికి పోదాం."

"ఐ డోంట్ మైండ్!" అందామె.

కారును పోనిస్తూ ఓరగా అతడామెవంక చూశాడు. ఉష చలాకీ అయిన యువతి. పెద్ద కళ్ళు.

"ఉషా, నువ్వు మహా అందంగా వున్నావు!" అన్నాడతను.

"నిజంగా?"

"ఇంకా చెప్పాలంటే నిన్ను చూస్తే నాకు పిచ్చి ఎక్కుతోంది!"

"ఐయామ్ సారీ! నన్ను చూసి మీరు పిచ్చివాళ్ళవడం

నాకు నచ్చదు!" అందామె.

అతడు కారును పోనిస్తూ ఫిల్టర్ సిగరెట్ వెలిగించాడు.

"అమ్మా నాన్నా నన్ను పెళ్ళిచేసుకోమని తొందర పెడుతున్నారు!"

"చేసుకోండి" అందామె.

"సరైన పిల్ల దొరకాలిగా?"

ఆమె విచిత్రంగా నవ్వింది.

"లోకం గొడ్డుపోలేదు. చదువుకున్న అందమైన యువతులు ఎందరో వున్నారు."

"నీ అంత అందమైన యువతి నా కెక్కడా కనపడలేదు!" అన్నాడతను.

"అయితే నన్నే పెళ్ళాడండి!" అందామె కొంటెగా.

అతడామె చెయ్యి పట్టుకున్నాడు.

"నన్ను నిజంగా పెళ్ళాడ్తావా? ఐ లవ్ యు!"

"నరేష్, చెయ్యి వదిలేయండి. పెళ్ళి ముందు నా ఒంటిమీద చెయ్యివేస్తే నాకు నచ్చదు."

"నా పేరు మీకు తెలిసే?"

"ఇరుగు పొరుగు వాళ్ళంగా, పేర్లు తెలియకుండా వుంటాయా?" అందామె.

అతడు ఈగా థియేటర్ కాంపౌండులో కారాపి దిగాడు.

"క్షణంలో వచ్చేస్తాను. టికెట్లు బుక్ చెయ్యాలి. పిక్చర్ కి నువ్వూ వస్తావా?"

"మా నాన్న ఒప్పుకోరు."

"ఇదంతా నాన్నకు తెలియాలా?"

"ఏం జరిగినా తలిదండ్రులకు చెప్పడం నాకు అల

వాడైపోయింది."

అతడు థియేటర్‌లోకి వెళ్ళాడు. ఆమె ఒంటిరిగా కార్లో కూర్చుంది. ఒక అంబాసిడర్ కారొచ్చి పక్కనే ఆగింది. కారులో నలుగురు మొగాళ్ళు వున్నారు.

డ్రయివర్ సీటులో వున్నతను ఆమెవైపు నవ్వుతూ చూశాడు.

"సిష్టర్, నీలాంటి యువతి నరేష్‌లాంటి మోస గాడితో తిరగడం మంచిదికాదు. ఇప్పటికప్పుడే డజన్ మంది యువతులను నమ్మించి, అనుభవించి వదిలేసేడతను" అన్నాడతను.

ఆమె తలుపు తెర్చుకుని కిందకు దిగింది.

"మంచివాడేమో అని పొరబడ్డాను. మీరిచ్చిన అడ్వయిన్‌కి థాంక్స్. బస్సులో పోతాను" అని ఆమె వెళ్ళిపోయింది.

కాస్సేపట్లో నరేష్ యీలవేస్తూ కారు దగ్గరకొచ్చాడు. ఆమెకోసం నలువైపులా చూశాడు.

"ఈ కారులో ఒకమ్మాయి వుండాలి. ఆమె ఎటు వెళ్ళిందో చూశారా?" నరేష్ అడిగాడు పక్క కారు లోని వాళ్ళను.

అంబాసిడర్ వెనుక తలుపు తెరవబడింది. ఇద్దరు కిందకు దిగారు. నరేష్‌ని లాక్కొచ్చి అంబాసిడర్ కారులో కూర్చోబెట్టారు.

"మీరెవరు? మీకేం కావాలి?" అరిచాడు నరేష్.

అంబాసిడర్ కారు బయటకు దూసుకుపోయింది.

"నన్ను వదిలేయండి!" అతడు వేడుకున్నాడు.

"షట్ యువర్ డర్టీ మౌత్!" అరిచాడు ఒకతను. నల్లటి గుడ్డను అతడి కళ్ళమీద కప్పి వాళ్ళు కట్టే

కారు. నోరు మెదపకుండా వుండేందుకు అతడి పెదిమలను సెలో టేప్ తో అతికించారు. నరేష్ భయంతో కూర్చున్నాడు.

ఆ నాటి రాత్రి పదింటికి ఫియట్ కారు నరేష్ ఇంటి గేటుముందు ఆగింది. గూర్ఖా కారువైపు వచ్చాడు.

కారులోంచి దిగినతను గూర్ఖా వైపు చూశాడు.

“తప్పతాగి అతడు కారులో పడుకున్నాడు. కారును లోపలకు తీసుకుపో!” అని అతడు వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

గూర్ఖా కారులోకి చూశాడు. నరేష్ వెనుక సీటు మీద పడుకుని వున్నాడు. అతడి పాంటుమీద రక్తం మరకలు వున్నాయి.

గూర్ఖా లోపలకు పరుగెత్తాడు. నరేష్ అన్న కారును లోపలకు తోలుకుపోయి ఆపాడు. నరేష్‌ని మోసుకెళ్ళి అతడి గదిలో పరుపుమీద పడుకోబెట్టారు.

ఎంత తట్టినా నరేష్ లేవలేదు. అతడు గాఢనిద్రలో వున్నాడేమో!

## 8

పోలీసు కమీషనర్ అరవిందన్ కారులోంచి దిగి విశాలమైన హాల్లోకి వెళ్ళాడు.

ఎనభై ఏళ్ళ దేవరాజు నవ్వుతూ అతడికి స్వాగతం యిచ్చాడు.

దేవరాజు చేతులు వణుకుతున్నాయి. ఏ క్షణంలోనైనా యీ లోకాన్ని విడిచి పోయేస్థితిలో వున్నాడు.

“దేవరాజుగారూ, నాకు ఎన్నో పనులున్నా మీరు రమ్మని ఫోన్ చేస్తే వెంటనే వచ్చాను” అన్నాడు అరవిందన్.

"అరవిందన్, మన పట్నంలో చాలా ఘోరాలు జరుగుతున్నాయి. యెవరో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని, మనుషులను శిక్షిస్తున్నారు. ఇలా అంతా జరిగితే పోలీసులూ, కోర్టులూ ఎందుకో నాకు అర్థం కావడంలేదు" అన్నాడు దేవరాజు.

"ఏం జరిగిందో చెప్పండి!"

"రాజూ!" పిల్చాడు దేవరాజు.

పెద్దకొడుకు రాజా వెంటనే వచ్చాడు.

"అరవిందన్ గార్ని నరేష్ గదిలోకి తీసుకు వెళ్ళు అంతా చూస్తారు."

"అలాగే, నాన్నా" అన్నాడు రాజా.

పైకి రాజాతో వెళ్ళి అంతా చూసి, నరేష్‌తో మాట్లాడి పోలీసు కమీషనర్ అరవిందన్ కిందకు వచ్చాడు. దేవరాజు కెదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"అంతా చూశాను యెవరో కసితో నరేష్‌ని నపుంసకుడిగా చేసిపారేశారు. నరేష్‌కి ప్రాణాపాయంలేకుండా ఏ సర్జనో యిదంతా చేశాడని నాకు అనుమానంగావుంది. నరేష్‌తో మాట్లాడాను. అతడిని రిపోర్టివ్వమన్నాను. ఇదంతా యెవరు చేశారో నేను దర్యాప్తు చేయిస్తాను" అన్నాడు అరవింద్.

"నరేష్ స్థితి చూస్తూంటే భయమేస్తోంది. వాడికి జరిగినది యీ పట్నంలో ఏ యువకుడికైనా సంభవించవచ్చు. నరేష్‌ని నలుగురు లాక్కుపోయారు. ఒక ముఠా యిదంతా చేసుండాలి" అన్నాడు దేవరాజు.

అరవిందన్ సూటిగా దేవరాజువంక చూశాడు.

"నరేష్ ఎటువంటివాడు?"

"బుద్ధిమంతుడు. బి. ఎ. పాసయ్యాడు. మంచి సం

బంధంకోసం చూస్తున్నాను. కాని యిప్పుడు పెళ్ళిచేయ వలసిన అవుసరంలేదు" అన్నాడు దేవరాజు బాధతో.

"మంచివాడికి అంత ఘోరమైన శిక్ష యెవ్వరూ విధించరు!" అన్నాడు అరవిందన్.

"పోనీ చెడ్డవాడనుకోండి! అయినా అంత కఠిన శిక్షా? శిక్షించే హక్కు మనదేశంలో కోర్టులకు మాత్రం వుంది. దారిన పోయే దానయ్యా తనొక జడ్జినని భావిస్తూ తీర్పులు యివ్వడం మన చట్టానికే విరుద్ధం."

"అవును, నిజమే కాని ప్రజా శక్తి అనేది కూడా వుంది. ఒక కారు యాక్సిడెంట్ మూలంగా ఏ యువకుడో చనిపోయాడనుకోండి. అది చూసిన ప్రజలు ఆగ్రహంతో వెళ్ళి డ్రయివర్ని హింసించవచ్చు. అలాగే నరేష్ విషయంలో కూడా జరిగిందని నా అనుమానం. ఇదంతా చట్టానికి విరుద్ధం, అది నేను ఒప్పుకుంటాను."

"అరవింద్, మంత్రులదాకా దీని గురించి నేను వెళ్ళగలను. కాని మీతో మాట్లాడ్డం మంచిదని మిమ్మల్ని రమ్మన్నాను."

"దేవరాజుగారూ, నేను దర్యాప్తు చేయిస్తాను. ఆ మూతాను పట్టుకుంటాం" అన్నాడు అరవిందన్.

"థాంక్స్, ఏదో తొందరగా చేయండి. ప్రస్తుతం నా కంపెనీలను నా కొడుకులే నడుపుతున్నారు. నేను విశ్రాంతి తీసుకుంటూ యింట్లో కూర్చుంటున్నాను. ఏదేనా తెలిస్తే ఫోన్ చేసి చెప్పండి."

పోలీసు కమీషనర్ అరవిందన్ సెలవు తీసుకుని బయటకు వెళ్ళి కార్లో కూర్చున్నాడు. వెంటనే కారు కదిలింది.

తండ్రి చేయిపట్టుకుని రాజా మెల్లిగా అతడిని పడ గ్గదిలోకి తీసుకు వెళ్ళి పరుపుమీద పడుకోబెట్టాడు.

## 9

నరేష్ తల్లివైపు దీనంగా చూశాడు.

"అమ్మా, ఆ మంగమ్మ ఏమైంది?"

"జీతం యిచ్చి పొమ్మన్నాను. ఏమైందో నాకు తెలియదు."

అతడు తల్లి చెయ్యి పట్టుకున్నాడు.

"ఒకసారి ఆమెను యిక్కడకు రప్పించు!"

"ఎందుకు?"

"నేను నీతో అబద్ధాలు ఎన్నో చెప్పానమ్మా. మంగమ్మ మంచిది. ఆమెను నేను మోసం చేశాను. ఒక్క సారి ఆమెతో మాట్లాడాలి. నన్ను క్షమించమనాలి."

"పనిమనిషి నిన్ను క్షమించడమేమిటిరా! దానిని ఏదో నువ్వు చేసివుండొచ్చు. కావలసిన డబ్బు యిచ్చేస్తే అది చాలు."

"నేను డబ్బిస్తే ఆమె తీసుకోలేదు. డబ్బుకోసం ఆమె నా దగ్గరకు రాలేదు."

"ఆమె రంభా వూర్వసా నిన్ను ప్రేమించడానికి?" ప్రశ్నిందామె.

"ఆమె ఎవరైనా నేను పురుషుడిని కానుగా ఇప్పటి నీతిలో!" అన్నాడతను దీనంగా.

ఆమె మౌనంగా అతడివైపు చూస్తూ వుండిపోయింది.

"నరేష్, మంగమ్మ ఎక్కడుందో కనుక్కొని రమ్మం టాను" అందామె.

ఆ రోజే ఆమె గూర్ఖాతో మాట్లాడింది. అప్పుడప్పుడు మంగమ్మ రోడ్డమ్మట వెళ్తూంటే చూశానని గూర్ఖా

అన్నాడు.

"ఈసారి ఆమె కనిపిస్తే లోపలకు రమ్మను" అందామె.

గూర్ఖా తలాడించి వెళ్ళిపోయాడు.

మూడు రోజుల తర్వాత ఆమె గూర్ఖాకు కనిపించింది. అతడామెను పిల్చాడు. లోపలకు వెళ్ళి అమ్మను చూడమన్నాడు.

"ఎందుకు?" అందామె.

"నాకు తెలియదు" అన్నాడతను.

మంగమ్మ లోపలకు వెళ్ళింది. నరేష్ తల్లి నవ్వుతూ ఆమెను ఆహ్వానించింది.

"ఎందుకమ్మా?"

"మేడమీదకెళ్ళి ఒకసారి నరేష్‌ని చూసిరా. నీకోసం వాడు అడుగుతున్నాడు."

"ఆశ్చర్యంగా వుందమ్మా!"

మంగమ్మ మెల్లిగా మెట్లెక్కి పైకి వెళ్ళింది. నరేష్ గదిలోకి ప్రవేశించింది.

పరుపుమీద పడుకున్న నరేష్ ఆమెవైపు చూసి తటాలున లేచాడు. ఆమెను కౌగలించుకుని వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

"మంగీ, నన్ను క్షమించు. నేను నీకు ద్రోహం చేశాను. నిన్ను మోసం చేశాను. దేవుడు నన్ను శిక్షించాడు" అన్నాడతను.

ఆమె నిశ్శబ్దంగా వుండిపోయింది. అతడికి వాళ్ళిచ్చిన శిక్ష గురించి ఆమె వింది. నంబర్ 25 ఆమెకు చెప్పాడు. ఆమె లోలోపల బాధపడింది.

"ఇలా చేస్తేగాని ఆ దుష్టుడి జీవితంలో మార్పు

రాదు!" అన్నాడు నంబరు 25.

నరేష్ పక్కనే ఆమె పరుపుమీద కూర్చుంది. అత డామె కళ్ళలోకి చూశాడు.

"నా బిడ్డ ఏమైంది?" అడిగాడతను.

"మీ బిడ్డ మీకు కావాలా?"

"నీలో పెరిగే బిడ్డే నాకు యీ జీవితంలో మిగిలినది" అన్నాడతను ఆవేశంతో.

ఆమె అతడివైపు సూటిగా చూసింది.

"బిడ్డను కని మీకిస్తాను" అందామె.

అతడామెవైపు చూశాడు. ఆమె చెయ్యి పట్టుకుని మెల్లిగా నిమిరాడు.

"మంగీ, ఆ పాపతో ఆడుకుంటూ నేనీ జీవితాన్ని సాగించవచ్చు. నా బిడ్డకు తల్లిగా నీ రూపం నా హృదయంలో శాశ్వతంగా నిల్చిపోతుంది."

కన్నీళ్ళతో ఆమె అతడివంక చూసింది.

"మీ జీవితంయింతగా మారుతుందని నేను ఊహించలేకపోయాను" అందామె.

అతడి తల్లి గదిలోకి వచ్చింది. ఆమెను చూసి మంగమ్మ లేచి నిలబడింది.

"అమ్మా నాలో నీతీ నిజాయితీ వుంటే మంగమ్మ నీ కోడలు అయివుండేది. కాని ఇప్పుడు నన్ను పెళ్ళాడమని ఆమెను నేను అడగలేదు. నన్ను పెళ్ళాడితే ఆమె జీవితం యొడారిలోని వెన్నెల్లా వ్యర్థమవుతుంది."

"అలా అనకండి. మిమ్మల్ని పెళ్ళాడ్డానికి నేను అప్పుడూ, యిప్పుడూ సిద్ధమే!" అంది మంగమ్మ.

అతడు పరిహాసంగా నవ్వాడు.

"మంగీ, నాకేం జరిగిందో నీకు పూర్తిగా తెలియదను

కుంటాను."

"ఏం జరిగిందో తెలుసు. జీవితంలో ముఖ్యమైనది దాంపత్య సుఖం ఒక్కటే కాదు. నేను మీతో వుంటాను. మనిద్దరం ప్రజలకు సేవ చేస్తూ ఆనందించవచ్చు."

నరేష్ ఆమె చెయ్యి పట్టుకుని దగ్గరగా లాగాడు.

"అమ్మా, ఆమె చెప్పింది విన్నావా?"

"విన్నానురా" అంది తల్లి.

"అమ్మా, నాన్నతో మాట్లాడి మా పెళ్ళికి ముహూర్తం పెట్టించమ్మా" అన్నాడతను.

"పెట్టిస్తానురా" అని తల్లి కిందకు వెళ్ళిపోయింది.

# 10

మంగమ్మ, నరేష్‌ల పెళ్ళి వైభవంగా సాగిపోయింది. ఆమె కలలు కన్నట్లే మంగమ్మ ధనవంతుల యింటి కోడలు అయింది.

ఆ రోజు రాత్రి దేవరాజు ఆరోగ్యం బాగాలేదు. అతడు భార్యను పిల్చాడు.

"ఒకసారి నరేష్‌ను నా గదికి రమ్మను."

"ఈ స్థితిలో ఏమి మాట్లాడగలరు?" అందామె.

"మళ్ళా మాట్లాడే అవకాశం గాక వుండక పోవచ్చు."

ఆమె పైకి వెళ్ళింది. నరేష్ పక్కనున్న మంగమ్మకు ఏదో కథ చెప్తున్నాడు. గదిలో లైటు వెల్గుతోంది.

"నరేష్, నాన్నగారు నిన్ను పిలుస్తున్నారు!" అందామె.

"ఆయనకెలా వుంది?"

"అంత బాగాలేదు. వెళ్ళి చూడు!"

నరేష్ వేగంగా కిందకు వెళ్ళాడు. తండ్రి గదిలోకి

అడుగు పెట్టాడు.

"తలుపు మూసిరా" అన్నాడు దేవరాజు.

తలుపుమూసి అతడు తండ్రి దగ్గరగా వెళ్ళాడు.

దేవరాజు కొడుకు చెయ్యి పట్టుకున్నాడు. అతడి కళ్ళమ్మట నీళ్ళు జలజల కారాయి.

"నాన్నగారూ, మీ ఆరోగ్యం బాగుపడ్తుంది. మీరు గాభరా పడకండి" అన్నాడు నరేష్.

"నరేష్, నేను బాధపడ్తున్నది చస్తానేమో అనే భయం మూలంగా కాదు. నేనొక పెద్ద పాపంచేశాను."

"అదేమిటో చెప్పండి! చేసిన పాపాన్ని గురించి చెప్పుకోడం ఒకవిధంగా ప్రాయశ్చిత్తం అవుతుంది" అన్నాడతను.

'నరేష్, నేనొక సీక్రెట్ సంస్థకు బాస్ని. ఎక్కడ అన్యాయం జరిగినా మా మనుషులు రంగంలోకి దిగుతారు. నరేష్, అనేకమంది యువతుల్ని నువ్వు మోసగించావు. మంగమ్మ నన్ను కల్సుకుని తనకు జరిగినదంతా చెప్పింది. నువ్వు నా కొడుకువని నాకు తెలుసు. అయినా నిన్ను ఘోరంగా శిక్షించమని నేనే ఆదేశించాను. పరాయివాడికిచ్చే శిక్ష నా కొడుకైనా నీకు కూడా యివ్వడం ధర్మమనిపించింది. నీ జీవితాన్ని నాశనం చేయించింది నేనే, నరేష్!" అన్నాడు దేవరాజు.

నరేష్ తండ్రివైపు చూసి కళ్ళు తుడుచుకున్నాడు.

"నాన్నా, మీరు చాలా గొప్పవారని రుజువుచేసుకున్నారు. చాలామంది తనవాళ్ళ దగ్గరకు వచ్చేసరికి పక్షపాతానికి బలైపోతారు. మిమ్మల్ని నేను మెచ్చుకుంటున్నాను" అన్నాడతను.

"నరేష్, నేను చేయించినదానికి నన్ను క్షమించు!"

"నాన్నా, పోయిందానికి నేను విచారించడంలేదు. ఇప్పుడు నా జీవితం మారిపోయింది. సరైన బాటమ్మట వెళ్ళగల్గుతున్నాను."

"నరేష్, రేపు రాత్రి పదింటికి దేశోద్ధారకుల సంఘం సమావేశం వుంది. నేను ఆ సమావేశానికి వెళ్ళలేను. ఇటుపైన ఆ సంస్థకు బాస్ నువ్వే. నువ్వా సంస్థను నడిపి లోకానికి మేలుచేస్తే నేను సంతోషిస్తాను" అన్నాడు దేవరాజు.

"అలాగే చేస్తాను, నాన్నా" అన్నాడు నరేష్.

"అలా కూర్చో కాస్సేపు!" అని దేవరాజు కొంత సేపు మౌనంగా వుండిపోయాడు.

"నాన్నా!" పిల్చాడు నరేష్.

అతడు కళ్ళు తెర్చి కొడుకువైపు చూశాడు. జేబు లోంచి ఒక తాళంచెవుల గుత్తినితీసి అతడికిచ్చాడు.

"ఈ గది కింద ఒక ఏర్ కండిషండ్ సీక్రెట్ రూమ్ వుంది. దేశోద్ధారకుల సంఘం గురించి అన్ని వివరాలూ ఆ గదిలోకెళ్తే నీకు తెలుస్తాయి. అక్కడకు వెళ్ళిరా!" అన్నాడు దేవరాజు.

నరేష్ లేచి గది నలువైపులా చూశాడు. కింద గదికి తోవ ఎక్కడుంది?

నేలమీదున్న మూడు మొసాయిక్ రాళ్ళను పైకి ఎత్తాడు. కిందకు మెట్లు వున్నాయి. అక్కడున్న స్విచ్ నొక్కగానే లైట్ వెలిగింది.

మెట్లమ్మట అతడు కిందకు దిగాడు.

తన చేతిలో వున్న ఒక తాళంచెవితో తలుపు తెర్చాడు. లోపలకు వెళ్లి స్విచ్‌లు నొక్కాడు. లైట్లు వెల్గాయి. ఏర్‌కండిషనర్ శబ్దం వినబడింది.

విశాలమైన గది. అక్కడ అరగంటపాటు కూర్చుని, అంతా తెల్సుకుని నరేష్ పైకి వచ్చాడు. మొసాయిక్ రాళ్ళను మునపటిలా పెట్టేశాడు.

తండ్రి దగ్గరకు వెళ్ళి "నాన్నా!" అన్నాడు.

కాని దేవరాజు లేవలేదు. అతడు శాశ్వత నిద్రలోకి జారిపోయాడు.

తండ్రి శరీరాన్ని ముట్టుకు చూసి నరేష్ బయటకు పరుగెత్తాడు.

"అమ్మా! మంగీ!" ఏడుస్తూ అరిచాడతను.

"ఏమిటిరా?" అడిగింది తల్లి.

"నాన్న మనల్ని విడిచి వెళ్ళిపోయారు" అని అతడు గదిలోకెళ్ళి మంచం పక్కనే కూర్చుండిపోయాడు.

మంగమ్మ వచ్చి అతడి చెయ్యి పట్టుకుని పక్కనే కూర్చుంది. ఆమెవైపు చూశాడతను.

ఇటుపైన ఆమె తన పక్కనుంటుంది. ఇద్దరూ కలిసి మంచిని పెంచుతూ తృప్తికరంగా జీవితాన్ని సాగించాలి. తండ్రి కోరినట్లు లోకానికి మేలుచేయాలి!

—: అ యి పో యి ం ది: —